క్లుప్తంగా

నేడు 'ఉపాధి'పై ప్రజావేదిక

హుస్నాబాద్‌రూరల్‌: మండలంలో గత ఏడాది చేపట్టిన జాతీయ ఉపాధి హామీ పనులపై గురువారం మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీఓ పద్మ బుధవారం తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సామాజిక కార్యకర్తలు హాజరు కావాలని సూచించారు.

శివాజీ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం



నూతన కార్యవర్గం

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): శివాజీ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందామని హిందూ వాహిని సిద్దిపేట జిల్లా సంయోజక్‌ బసవరాజ్‌ సత్యం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో సిద్దిపేట పట్టణ కమిటీని నియమించారు. కమిటీ అధ్యక్షుడిగా మాధవరెడ్డి, సహ సంయోజకులుగా వీరేశం, నవీన్‌, సంతోష్‌ చారిని ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హిందూ వాహిని రాబోయే కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సహ సంయోజక్‌ బండి కిరణ్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణ చర్చలు ప్రారంభించాలి



ఎల్‌ఐసీ ఆఫీస్‌ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

హుస్నాబాద్‌: ఎల్‌ఐసీ ఆఫీసర్స్‌, ఉద్యోగుల జాయింట్‌ ఫ్రంట్‌ ఐక్యత ఆధ్వర్యంలో తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎల్‌ఐసీ ఆఫీస్‌ ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగుల వేతన సవరణ చర్చలు వెంటనే ప్రారంభించాలని డిమాండ్‌ చేశారు. నూతన పెన్షన్‌ స్కీం కవరవుతున్న ఉద్యోగులకు యాజమాన్యం చెల్లించే కంట్రిబ్యూషన్‌ 10 నుంచి 14కు పెంచాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్‌ మేనేజర్‌ రవీందర్‌, క్లాస్‌ వన్‌ ఆఫీసర్‌ బి.రవీందర్‌, ఇన్సూరెన్స్‌ కార్పొరేషన్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ ప్రధాన కార్యదర్శి సదాశివరెడ్డి, ఎల్‌ఐసీ జేపీసీ సభ్యులు పాల్గొన్నారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరి



రైతులకు పశువుల దాణా అందజేస్తున్న అధికారులు

గజ్వేల్‌రూరల్‌: పశువుల పెంపకంలో పాడి రైతులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రజ్ఞాపూర్‌ పశువైద్యాధికారి జీవిత సూచించారు. బుధవారం గజ్వేల్‌ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లిలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు రైతులకు చెందిన పశువులకు కృత్రిమ గర్భధారణ చికిత్స చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పశువుల్లో మార్పులు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించాలని సూచించారు. అనంతరం పోషకాలతో కూడిన పశువుల దాణాను పాడిరైతులకు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తిరుపతయ్య, మహేందర్‌, స్వామినాథ్‌, గోపాల మిత్రలు, రైతులు పాల్గొన్నారు.

పార్ట్‌టైమ్‌ జాబ్‌ పేరిట మోసం

సిద్దిపేటకమాన్‌: పార్ట్‌టైమ్‌ జాబ్‌ పేరుతో గుర్తు తెలియని వ్యక్తి పంపిన వాట్సాప్‌ మెసేజ్‌కు స్పందించి ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో డబ్బులు పంపించి సైబర్‌ మోసానికి గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి పార్ట్‌ టైమ్‌ ఉద్యోగం ఉందని.. తక్కువ మొత్తంలో డబ్బులు పెట్టుబడిగా పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్‌ మెసేజ్‌ పంపాడు. అది నమ్మిన బాధితుడు ఆన్‌లైన్‌లో రూ. 46,280 పంపించాడు. తర్వాత ఆ నెంబర్‌కు ఫోన్‌ చేయగా స్విచ్ఛాఫ్‌ రావడంతో సైబర్‌ మోసం జరిగినట్లు గుర్తించి బాధితుడు వెంటనే జాతీయ హెల్ప్‌లైన్‌ నంబర్‌ 1930కు ఫిర్యాదు చేయగా డబ్బులు ఫ్రీజ్‌ చేశారు.

పరామర్శ

నంగునూరు(సిద్దిపేట): కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని టీపీసీసీ కార్యదర్శి గంప మహేందర్‌రావు అన్నారు. తిమ్మాయిపల్లికి చెందిన ధనాచారి బుధవారం మరణించడంతో ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

గంజాయిని సమూలంగా అరికట్టాలి

- హుస్నాబాద్‌ ఏసీపీ సతీష్‌
- పెండింగ్‌ కేసులపై అధికారులతో సమీక్ష



ఏసీపీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న పోలీస్‌ అధికారులు

హుస్నాబాద్‌: హుస్నాబాద్‌ సర్కిల్‌ పరిధిలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలను సమూలంగా అరికట్టాలని.. గంజాయి రహిత జిల్లా కోసం పోలీస్‌ అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఏసీపీ సతీష్‌ ఆదేశించారు. బుధవారం హుస్నాబాద్‌ ఏసీపీ కార్యాలయంలో సర్కిల్‌ పోలీస్‌ అధికారులతో పెండింగ్‌ కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి విక్రయించే ప్రదేశాలు, తాగే వ్యక్తులపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. వరంగల్‌, కరీంనగర్‌ జిల్లాల సరిహద్దులో ఉన్నందున తరచుగా వాహనాల తనిఖీ చేపట్టాలన్నారు. అండర్‌ ఇన్వెస్టిగేషన్‌ కేసులలో పోలీస్‌ కమిషనర్‌ విధించిన టార్గెట్‌ను అందరు రీచ్‌ కావాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో టార్గెట్‌కు మించి ఎక్కువ కేసులు అండర్‌ ఇన్వెస్టిగేషన్‌లో ఉండకూడదని, కేసులను వెంటనే ఛేదించి కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేయాలని పేర్కొన్నారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్‌ ముమ్మరం చేయాలని, దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాలు లేని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని సూచించారు. నేర దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా సర్కిల్‌ పరిధిలోని అధికారులు ఏసీపీ సతీష్‌కు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలి పారు. సమావేశంలో సీఐ కిరణ్‌, ఎస్సైలు మహేష్‌, వివేక్‌, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



సిర్సనగండ్లలో భక్తుల శోభాయాత్ర

అయోధ్య అక్షింతల పంపిణీ

చిన్నకోడూరు(సిద్దిపేట)/నంగునూరు/కొండపాక(గజ్వేల్‌): అయోధ్య శ్రీరాముల వారి పూజిత అక్షింతలను బుధవారం గ్రామాల్లో పంపిణీ చేశారు. చిన్నకోడూరు మండల పరిధిలోని మాచాపూర్‌, రామంచ, చిన్నకోడూరులో ఇంటింటికి పంపిణీ చేశారు. అక్షింతలతో పాటు అయోధ్య ఆలయ చిత్రపటాలను పంపిణీ చేశారు. అలాగే కొండపాక మండలంలోని సిర్సనగండ్ల, కుకునూరుపల్లి మండలంలోని కోనాయిపల్లిలో దేవతా మూర్తుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించి అక్షింతలను పంపిణీ చేశారు. నంగునూరు మండలం రాంపూర్‌ రామాలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు చేసి నంగునూరు వేంకటేశ్వరాలయం నుంచి రాంపూర్‌ వరకు శోభాయాత్ర నిర్వహించారు.

పిల్లలకు గడ్డు కాలం



మెనూలో కోడిగుడ్డు లేకుండానే భోజనం చేస్తున్న విద్యార్థినులు

మద్దూరు(హుస్నాబాద్‌): మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల వసతి గృహంలో విద్యార్థినులకు నెల రోజులుగా కోడిగుడ్డు అందడం లేదు. గతేడాది నవంబర్‌ 28వ తేదీ నుంచి బుధవారం వరకు సదరు కాంట్రాక్టర్‌ కోడిగుడ్లను సరఫరా చేయలేదు. జిల్లాలోని అన్ని కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల పరిధిలో కొనసాగుతున్న వసతి గృహాలకు చేర్యాలకు చెందిన కాంట్రాక్టర్‌ కోడిగుడ్లను సరఫరా చేస్తున్నాడు. అయితే మద్దూరు ఆదర్శ వసతి గృహానికి నవంబర్‌ 28వ తేదీ నుంచి ఇప్పటివరకు కోడిగుడ్ల సరఫరాను పూర్తిగా నిలిపివేశాడు. చికెన్‌, మటన్‌ కాంట్రాక్ట్‌ కూడా సదరు వ్యక్తే పొందాడు. అవి కూడా సక్రమంగా సరఫరా చేయడం లేదని వసతి గృహం విద్యార్థులు, వార్డెన్‌ చెబుతున్నారు. సదరు కాంట్రాక్టర్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని, అలాగే సకాలంలో కోడిగుడ్లు అందేవిధంగా సహకరించాలని కోరారు.

'ప్రజాపాలన'కు బారులు

వర్గల్‌(గజ్వేల్‌)/జగదేవ్‌పూర్‌/అక్కన్నపేట(హుస్నాబాద్‌)/హుస్నాబాద్‌/నంగునూరు(సిద్దిపేట)/నంగునూరు/చిన్నకోడూరు/గజ్వేల్‌రూరల్‌/కొండపాక/దౌల్తాబాద్‌/మిరుదొడ్డి/ములుగు(గజ్వేల్‌): ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

- వర్గల్‌ మండల కేంద్రం వర్గల్‌లో తహసీల్దార్‌ హరికిరణ్‌ పర్యవేక్షణలో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ల వద్ద మహిళలు బారులు తీరారు. సర్పంచ్‌ గోపాల్‌రెడ్డి, మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి తదితరులు దరఖాస్తుదారులకు పలు సూచనలు చేశారు. తొలిరోజు ప్రజల నుంచి వివిధ పథకాల కోసం 842 దరఖాస్తులు అందాయి. కాగా మాదారం, సీతారాంపల్లిలో ఎంపీడీఓ మేరీ స్వర్ణకుమారి పర్యవేక్షణలో ప్రజాపాలన కార్యక్రమం జరగగా, అవుసులోనిపల్లిలోనూ ప్రజాపాలన నిర్వహించారు.
- అక్కన్నపేట మండలం కేశవాపూర్‌, మంచినీళ్లబండ, గోవర్ధనగిరి, బొడిగెపల్లి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాలోతు లక్ష్మి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ సంజీవ్‌కుమార్‌, ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు నాయకులు పాల్గొన్నారు.
- జగదేవ్‌పూర్‌ మండలంలోని చాట్లపల్లి ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ శ్రావణ్‌కుమార్‌, సర్పంచ్‌ నరేష్‌, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.
- హుస్నాబాద్‌ పట్టణంలోని 17వ వార్డులో బుధవారం ప్రజాపాలన కార్యక్రమంపై కళాకారులు పాటలు పాడుతూ అవగాహన కల్పించారు. మున్సిపల్‌ కమిషనర్‌ రాజశేఖర్‌ దరఖాస్తులు స్వీకరించారు.
- నంగునూరు మండలం పాలమాకుల, మగ్దుంపూర్‌, అప్పలాయిచెర్వు, నాగరాజుపల్లి గ్రామాల్లో సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్‌ అనిల్‌కుమార్‌, ఎంపీడీఓ వేణుగోపాల్‌ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో టీపీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గంప మహేందర్‌రావు పాల్గొని దరఖాస్తులను పరిశీలించారు.
- చిన్నకోడూరు మండల పరిధిలోని విఠలాపూర్‌, రామంచ, మాచాపూర్‌, చౌడారం గ్రామాల్లో బుధవారం ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహించారు. సిద్దిపేట ఆర్డీఓ రమేష్‌ బాబు ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీనివాస్‌, తహసీల్దార్‌ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
- గజ్వేల్‌ మండల పరిధిలోని బెజుగామలో బుధవారం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం యాదగిరి, పంచాయతీ సెక్రటరీ సంతోష్‌, కాంగ్రెస్‌ నాయకుడు చిటుకుల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎంపీడీఓ మచ్చేందర్‌ పర్యవేక్షించారు.
- కుకునూరుపల్లి మండలంలోని బొబ్బాయిపల్లిలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. సర్పంచ్‌ కోల శ్రీనివాస్‌ వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.
- దౌల్తాబాద్‌ మండల పరిధిలోని ఇందుప్రియాల్‌లో దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ శ్యామల కుమార్‌, అధికారులు తదితరులు పాల్గొన్నారు.
- మిరుదొడ్డి మండలంతో పాటు అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలో బుధవారం అధికారులు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను తహసీల్దార్‌ గోవర్ధన్‌, ఎంపీడీఓ రాజిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి మల్లేశం స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం, వైస్‌ ఎంపీపీ పోలీస్‌ రాజులు, తదితరులు పాల్గొన్నారు.
- ములుగు మండలంలోని బహిలంపూర్‌, మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీలు, సింగన్నగూడ, శ్రీరాంపూర్‌ గ్రామాల్లో ప్రజాపాలన నిర్వహించారు. తహసీల్దార్‌ ప్రవీణ్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి రెండు బృందాలుగా ఆయా గ్రామాల్లో ప్రజలనుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ములుగు ఎంపీపీ లావణ్య అంజన్‌గౌడ్‌, సర్పంచ్‌ బాలకృష్ణ, సూపరింటెండెంట్‌ రామచంద్రం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్‌ కాంగ్రెస్‌ నాయకుడు రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.



ములుగు: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



వర్గల్‌: ప్రజాపాలన కౌంటర్ల వద్ద బారులు తీరిన మహిళలు



రామంచలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ రమేష్‌బాబు

నిర్మించారు.. వదిలేశారు!



నిరుపయోగంగా ఉన్న ఎంఆర్‌సీ భవనం

అక్కన్నపేట(హుస్నాబాద్‌): మండల కేంద్రంలో మండల వనరుల కేంద్రం (ఎంఆర్‌సీ) సుమారు మూడేళ్లుగా నిరుపయోగంగానే ఉంది. అయితే మండలంలో ఎంఈఓ పోస్టు ఖాళీగానే ఉండగా ఇన్‌చార్జి ఎంఈఓతో నెట్టుకొస్తున్నారు. అదేవిధంగా మండలంలో విద్యాశాఖ గాడి తప్పిందని విద్యార్థుల తల్లిదండ్రుల విమర్శిస్తున్నారు. ఈ భవనం నిరుపయోగంగా మారడంతో మందుబాబులకు అడ్డాగా మారుతోంది. ఇప్పటికైనా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ దృష్టిసారించి పర్మినెంట్‌ ఎంఈఓను కేటాయించాలని మండల ప్రజలు కోరుతున్నారు. తక్షణమే మండల వనరుల కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకోరావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లావ్యాప్తంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఆమె చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె సేవలను కొనియాడారు. భారత దేశ తొలి ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త, బాలికా విద్యకు బాటలు వేసిన సావిత్రిబాయి పూలేను బాలికలందరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



హుస్నాబాద్‌: సావిత్రిబాయి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రజిత తదితరులు



మిరుదొడ్డి: భూంపల్లిలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ చైర్మన్‌ వెంకటయ్య తదితరులు



ప్రజ్ఞాపూర్‌లోని సెయింట్‌ మేరీస్‌ విద్యానికేతన్‌లో..



చిన్నకోడూరులో..



సిద్దిపేట ఎడ్యుకేషన్‌: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

హామీలన్నింటిని అమలు చేయాలి

నర్సాపూర్‌ ఎమ్మెల్యే సునీతారెడ్డి



విజ్ఞప్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్‌): ఎన్నికల కన్న ముందు కాంగ్రెస్‌ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని నర్సాపూర్‌ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నవాబుపేట, లచ్చిరెడ్డిగూడం, దొంతి, గుండ్లపల్లి గ్రామాల్లో అధికారులు ప్రజాపాలన నిర్వహించారు. నవాబుపేట గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలనలో ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల కోసం ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల కోసం తప్పకుండా సహకరిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్‌ మెంబర్‌ మన్సూర్‌, ఎంపీడీఓ భారతి, తహసీల్దార్‌ శ్రీనివాస్‌చారి, ఆర్‌ఐ కిషన్‌, ఎంపీఓ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

మలుపు వద్ద స్పీడ్‌ బ్రేకర్లు

అక్కన్నపేట(హుస్నాబాద్‌): అక్కన్నపేట విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ మూలమలుపు వద్ద ఆర్‌అండ్‌బీ అధికారులు స్పీడ్‌ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ ఆదేశాల మేరకు అధికారులు ప్రమాదాలు జరగకుండా స్పీడ్‌ బ్రేకర్లను నిర్మిస్తున్నారు. అయితే ప్రమాదాలకు కేరాఫ్‌గా మారిన ఈ మూలమలుపు విషయాన్ని ఇటీవల సర్పంచ్‌ ముత్యాల సంజీవ్‌రెడ్డి మంత్రి పొన్నం దృష్టికి తీసుకెళ్లారు. ఈనేపథ్యంలో అధికారులు గత రెండ్రోజులుగా పలుచోట్ల గుంతలు పడిన రోడ్లకు సైతం మరమ్మతులు చేయిస్తున్నారు. వెంటనే స్పందించి అధికారులను ఆదేశించిన మంత్రి పొన్నంకు సర్పంచ్‌ సంజీవ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ కాశబోయిన ఎల్లయ్య, కాంగ్రెస్‌ ఎస్టీ సెల్‌ మండలాధ్యక్షుడు రవినాయక్‌, వెంకటయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ క్యాలెండర్ల ఆవిష్కరణ



మిరుదొడ్డి(దుబ్బాక): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీఎస్‌) మిరుదొడ్డి మండల శాఖ ఆధ్వర్యంలో చెప్యాల జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో బుధవారం నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్కూల్‌ కాంప్లెక్స్‌ హెడ్‌మాస్టర్‌ శ్రీనివాస్‌, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

◆ బీమా చెక్కు అందజేత

సిద్దిపేటకమాన్‌: బ్యాంక్‌లో ప్రధాన మంత్రి జీవన్‌ యోజన పథకం కలిగి ఉన్న ఖతాదారుడు ఇటీవల గుండెపోటుతో మృతిచెందడంతో అతడి కుటుంబ సభ్యులకు రూ. 2 లక్షల ఇన్స్‌రెన్స్‌ క్లెయిమ్‌ చెక్‌ను బ్యాంక్‌ అధికారులు బుధవారం అందజేశారు. యూనియన్‌ బ్యాంక్‌ రీజినల్‌ మేనేజర్‌ వికాస్‌ ఈదా, బ్రాంచ్‌ మేనేజర్‌ భరత్‌నామ్‌దేవ్‌ మాట్లాడుతూ.. సిద్దిపేట పట్టణానికి చెందిన కోటగిరి శ్రీనివాస్‌ పట్టణంలోని యూనియన్‌ బ్యాంక్‌లో సేవింగ్‌ ఖాతా కలిగి ఉన్నాడన్నారు. అతడు ప్రధాన మంత్రి జీవన్‌ యోజన పథకం కింద ప్రతి సంవత్సరం రూ. 436 చెల్లిస్తున్నాడు. గత నవంబర్‌ 12వ తేదీన శ్రీనివాస్‌ గుండెపోటుతో మృతి చెందగా బుధవారం పట్టణంలోని యూనియన్‌ బ్యాంక్‌కు పిలిపించి రూ. 2 లక్షల ఇన్స్‌రెన్స్‌ క్లెయిమ్‌ చెక్‌ను అందజేసినట్లు బ్యాంక్‌ అధికారులు తెలిపారు.

◆ డంపింగ్‌యార్డ్‌ పరిశీలన

గజ్వేల్‌రూరల్‌: పట్టణ శివారులోని డంపింగ్‌ యార్డును మున్సిపల్‌ చైర్మన్‌ ఎన్‌సీ రాజమౌళి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా డంపింగ్‌ యార్డులో జరుగుతున్న పనులను, ఎఫ్‌ఎస్‌టీపీని సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇళ్ల ముందుకు వచ్చే పారిశుధ్య వాహనాల్లోనే చెత్తను వేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీధర్‌ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

◆ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నాయకులు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డిని జిల్లా కాంగ్రెస్‌ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు కాంగ్రెస్‌ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌ తెలిపారు. టీపీసీసీ సభ్యులు దరిపల్లి చంద్రం ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని, అదేవిధంగా మంత్రులు పొన్నం ప్రభాకర్‌, పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డిని కలిసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిద్దిపేట యువజన కాంగ్రెస్‌ అధ్యక్షుడు గయసుద్దీన్‌, నజ్జు తదితరులు పాల్గొన్నారు.

◆ గురుకులాల్లో ప్రవేశాలకు పరీక్ష

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ గురుకులాల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ప్రవేశాలకు ఫిబ్రవరి 11న ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు అల్వాల, చెప్యాల క్రాస్‌ రోడ్డులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్‌ విద్యార్థులు ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో ఈనెల 6 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు హెల్ప్‌లైన్‌ నంబర్‌ 180042545678లో సంప్రదించాలని సూచించారు.